

# అపఖ్యాత

"అవంతి"

శాక్యముని గౌతమ బుద్ధుడు తన మనసెరిగిన ప్రియ శిష్యుల్ని ప్రపంచపు నలుమూలలకూ మత ప్రచారానికి పుత్తెంచేటపుడు వారికి విపులంగా సూచనలిచ్చి పంపించాడు. ఇంతవరకూ ఏ మత ప్రవక్తా యివ్వని సూచనకూడా ఒకటిచ్చాడు. ఏ పరిస్థితులలో కూడా మహాద్భుతాలూ, మానవాతీత ప్రదర్శనలూ- చేయవద్దని. బుద్ధదేవుడు నియమించిన యితర సూత్రాలు ఆచరించడంలో ఒక్కొక్కప్పుడు దాటని శిష్యులు విఫలులైనా మానవాతీత ప్రదర్శనలు చేయవద్దన్న నిర్ణయాన్ని మాత్రం, ఒక్క ఆనందుడొక్క, మిగతా వారంతా తు. చ. తప్పకుండా ఆచరించారు. ఆనందుని గురించి, యీ క్రింది కథ లనుశ్రుతంగా వస్తూన్నవి.

ఆనందుడు మగధ సామ్రాజ్యంలో తన ప్రచారం మొదలుపెట్టేడు. జీవహింస, కులభేదాలు, బ్రాహ్మణుల అహంకారం క్రింద నలుగుతూన్న హిందూ ప్రజలకు బౌద్ధమతం ముక్తిసాధన కొక నూతన మార్గం చూపించింది. ఆనందుని వాక్చాతురి, గంభీర విగ్రహం, బౌద్ధ సూత్రాలు ప్రజలను నచ్చి బౌద్ధమతంవేపు బాగా మొగ్గసాగారు. ఈ ప్రథమ విజయంతో ఆనందునికి తల కొంచెం తిరిగింది.

"శాస్త్రీయ హేతువాదంతో, నిర్దుష్ట జీవితంతో, వాక్చాతుర్యంతో, ముక్తిమార్గం బోధించే మతప్రవక్త- మొండివాదనలతో, పాపభీతితో ప్రచారం చేసే యీ బ్రాహ్మణులకన్న ఎంత ధన్యుడో కదా!" అనుకున్నాడు.

గర్వీభూతమైన పైమాటలు పలకడంతోడనే, ఆనందుని కీర్తికాంతులు పదహారు యోజనాల మేర తగ్గిపోయాయి. ఆనందుని సుగుణపుంజంకూడా వన్నె తగ్గింది. మరునాడు ఆనందుడు తన బోధనలు మొదలిడినపుడు, ప్రజలు మొదట వెక్కిరించారు, తరువాత అల్లరి చేశారు. చివరకు రాళ్లుకూడా రువ్వేరు.

అదే సమయానికి, మూర్ఛపోయిన ఒక కుర్రవానిని కొందరు బ్రాహ్మణులు క్రింద పడవేసి, తెలివి తెప్పించడానికి నానా అవస్థలూ పడుతూండడం చూశాడు ఆనందుడు. ఇంతలో ఒక ప్రబుద్ధుడు యిట్లా అన్నాడు:

'వీణ్ణి యేదో దయ్యం ఆవేశించింది. వీడి శరీరాన్ని బాధలు పెడితే, ఆ దయ్యం పారిపోతుంది.''

అందరూ కలిసి, ఆబాలుని బాదడం మొదలెట్టారు. ఆనందుడు వెంటనే కలగజేసుకొని, ఆ బ్రాహ్మణుల్ని తరిమేశాడు. తను మోకాళ్లమీద పడి, దేవుని ప్రార్థించడం మొదలెట్టాడు. ప్రార్థన ఆఖరయినా, అతడింకా లేవలేదు. ఆ కుర్రవాడికి, మామూలుగా తెలివి వచ్చేవరకూ ఆనందుడు ప్రార్థనలు చేస్తూనేవున్నాడు.

ఇది చూసిన, ఆ మూర్ఖప్రజలు "మహాద్భుతం! మహామాయ" అని అరుస్తూ ఆనందుని చుట్టూ చేరి, అతని మతం స్వీకరించారు. ఆనందుడుకూడా, తన పోయిన గౌరవాన్నీ విధంగా సంపాదించినందుకు సంతోషించి, "మనఆశయమే ముఖ్యమైంది; దానిని సాధించే విధానంకోసం విచారించ నక్కరలేదు-" అనుకున్నాడు.

ఈ ఒక్కపనితో, ఆనందుని సుగుణసంపద పూర్తిగా నశించింది. కాని, కరుణామయుడు-బుద్ధదేవుడు మాత్రం, తన శిష్యుని చర్యలింకా క్షమా దృష్టితో పరిశీలిస్తున్నాడు.

ఆనందుని కీర్తి ఆ రాజ్యమంతా పాకింది. రాజు కూడా విన్నాడు. ఆనందుని పిలిపించి, దయ్యాన్ని తరిమి వేసిన మాట నిజమేనా అని అడిగేడు. ఆనందుడు నిజమే అన్నాడు.

"అయితే నా అదృష్టం పండింది. మీ శక్తుల మూలంగా, ఇరవై తొమ్మిది రోజులనుండి తెలివి తప్పి, మృత్యుముఖాన్నున్న నా కుమారుని బతికించాలి" అన్నాడు రాజు.

"ఒక సామాన్య బాలకుని బాధా నివారణ చెయ్యగల్గిన నా స్వల్పశక్తులు, రాజ మార్తాండులైన తమ పుత్రుల కేవిధంగా సహాయకారి కాగలవు ప్రభూ?"

"ఆశక్తులు ఏవిధంగా సంపాదించ గల్గుతారు?"

"కామక్రోధమదమాత్సర్యాలను జయించటం వల్లా, యోగాభ్యాసంవల్లా ఆ శక్తులు సమకూరుతాయి. వాటిలో పరిపూర్ణుడు అయినవాడు, ప్రచండవాయువుల్నీ సముద్రజలాల్నీ సూర్యచంద్రుల్నీకూడా శాసించగలడు."

"అయితే మీరు నా కుమారుని వ్యాధి కుదర్చలేక పోవడానికి కారణం, శక్తిలేకపోవడం. కనక, మిమ్మల్ని, బ్రాహ్మణుల అధీనం చేస్తాను. మీసాధనకు సదుపాయాలు వారు సమకూరుస్తారు" అన్నాడు రాజు.

భయంతో ఆనందుడు చెప్పబోయేదేదీ వినకుండానే, అక్కడి బ్రాహ్మణులతని నొక దేవాలయానికి లాక్కుపోయారు. బట్టలన్నీ వూడతీసేశారు. ఆనందుని శరీరంమీద ఒక్క మచ్చగాని, గాయపు ఆనవాళ్లుగాని ఏమీ లేవు. ఆ బ్రాహ్మణుల కాశ్చర్యం వేసింది, ఇతను మానవుడు, శరీరాన్ని కష్టపెట్టకుండానే స్వర్గానికి పోదామనుకుంటున్నాడని. వెంటనే ఆనందుని బోర్లగిలా పడుకోబెట్టి, నడ్డిమీద చర్మం అంతా లేచిపోయేటట్లు కమ్చీలతో బాదేరు. తరువాయి, మరునాడు తీర్చడానికి నిర్ణయించుకుని అతని నక్కడే పడవేసి, గుడికి తాళంవేసి వెళ్లిపోయారు.

ఆనందుడు అర్ధ మరణావస్థలో పడివున్నాడు. ఇంతలో, అక్కడ స్వయం ప్రకాశమానమయిన దయ్యం ఒకటి సాక్షాత్కరించి ఆనందుని పలకరించింది.

"ఆనందా, నీ తెలివితక్కువ కిప్పటికేనా పరితపిస్తున్నావా? లేదా?"

ఆనందుడు మాట్లాడలేదు.

"నే చెప్పిన మాట వింటే, నీ గాయాలు మానిపోతాయి. పైగా ఈ రాజ్య ప్రజలంతా నీమతం స్వీకరిస్తారు."

"ఏవిధంగా?" అన్నాడు ఆనందుడు.

"నీ గురువాక్యనిరాదరణ, అన్యాయం– వీటిలో పూర్తిగా మునిగితే సరి."

ఆనందుడేమీ మాట్లాడలేదు. ఆ దయ్యమే యింకా సంభాషణ సాగిస్తోంది.

"రాజకుమారుడు, ముప్ఫయిరోజులు పూర్తి అయేసరికి ఆ మూర్ఛలోంచి లేస్తాడు. ఆసమయం సరిగా చూసి నీవు వెళ్ళి, రాజకుమారుని పర్యంకం మీద కూర్చుని నీ యిష్టం వచ్చిన మంత్రాలు చదువు. ఇంతలో అతడికి తెలివి వస్తుంది. అది నీ మహిమే అనుకుంటారు. యావన్మగధరాజ్యమూ, నీ శిష్యులవుతారు. కాని ఒకటిమాత్రం జ్ఞాపకం వుంచుకో, ఇప్పుడు నేను చెప్పినట్లు చెయ్యటానికి నీ వంగీకరిస్తే, అది నీవు కళ్లు తెరుచుకునే చేస్తున్నావని. పైగా, దీనివల్ల నీకష్టాలింకా అభివృద్ధి అవుతాయే కాని తగ్గవు."

"ఒప్పుకున్నాను" అన్నాడు ఆనందుడు బాధపడలేక.

దయ్యం అతని నడ్డి నిమిరింది. వెంటనే బాధలుపోయాయి, కొత్తచర్మం వచ్చింది. "నీ కవసరం అయినపుడు "హూంగ్, పస్మె, మాని, ఆ మునా" అని పిలవ"మని చెప్పి, ఆ దయ్యం మాయమయిపోయింది.

ఆనందుని చర్మం కొంచెం కొంచెం వొలిచివేయడానికి, బ్రాహ్మణులు, ఒక రాజాధికారితో సహా వచ్చి, గుడి తలుపులు తెరిచారు. ఆనందుడు మామూలుగా వుండడం చూసి, ఆ బ్రాహ్మణులకు మితిలేని కోపం వచ్చింది; కాని ఏమీ చేయలేకపోయారు. ఆ రాజాధికారి, ఆనందుని రాజసన్నిధికి క్షేమంగా చేర్చాడు. రాజకుమారుడింకా అదే అవస్థలో పడివున్నాడు. తనకు ఆ దయ్యం చెప్పినట్లు, సాయంత్రం యింకా కాలేదు. కనక ఆనందుడు రాజుగారికీ, వారి అనుచరులకీ మహాద్భుతాలమీద, వాటి నితరు లేవిధంగా నెరవేర్చలేరో, ఒక్క బౌద్ధమత గురువులే ఎల్లా చేయగలరో, మొదలగు విషయాలమీద

ఉపన్యాసం యిస్తూ, సమయంకోసం కాలయాపన చేస్తున్నాడు. ఇంతలో సూర్యుడు అపరాద్రిలో క్రుంకే సమయం ఆసన్నమయింది. ఆనందుడు రాజకుమారుని గుండెలమీద చెయ్యిపెట్టి, కళ్లు మూసుకుని ఏవో జపిస్తున్నాడు. వెంటనే అతడు కళ్లు తెరిచి, ముప్ఫయి రోజుల క్రిందట తాను జూదం ఆడుతూన్నపు డీరోగం వచ్చి ఏ వాక్యాన్ని మధ్యలోనే ఆపేసిందో, ఆ వాక్యం పూర్తిచేశాడు.

అక్కడున్న వారందరూ నిశ్చేష్టులయిపోయారు. "ఈయన మానవాతీత శక్తులను పట్టిచూస్తే, యీయన మతంకూడా చాలా గొప్పదిలాగే కనిపిస్తూంది!" అన్నారు రాజుగారు. ఆయనతో పాటు యావన్మగధప్రజలూ బౌద్ధమతం స్వీకరించారు. రాజు వెంటనే, హిందూ దేవాలయాలకూ, మఠసంస్థలకూ యిచ్చిన ఆస్తులన్నీ లాగేసుకుని, బ్రాహ్మణహింస మొదలుపెట్టేడు. ఆ పాత మతం కొన్ని శతాబ్దాలలో చేసిన అన్యాయాన్ని కొన్ని రోజుల్లో యీ కొత్తమతం పేరిట చేసేశారు.

ఈ విజయంతో, ఆనందుడు పూర్తిగా గర్వి అయిపోయాడు. రాజుగారు ఆనందుని తమ కుమారునికి గురువుగా నియోగించారు. బౌద్ధ ధర్మాల నాశనికి బోధించాలని ఆనందుడు చాలా తాపత్రయపడ్డాడు కాని, కుదరలేదు. ఎందుచేతనంటే, రాజకుమారుడికి, చిన్నచిన్న పురుగుల్లో సూదులు గుచ్చి ఆనందించడం సరదా; యింక మరి, అహింసాధర్మానికీ, ఆ సరదాకీ ఏవిధంగా సమన్వయం?

కొన్ని నెలలు పోయిన తర్వాత, రాజసముఖానికి ఆనందుడు ఆహ్వానితుడయ్యాడు. రాజుగారికి కొంచెం దూరంలో, ఇద్దరు భయంకరంగా వున్న తలారులు నించున్నారు

"వీడు మాతలారి. వీడు చిత్రవధచేసే తలారి" అని రాజు వారిద్దరినీ ఆనందునికి పరిచయం చేశాడు. అటువంటి గొప్పవారితో పరిచయం కల్గినందుకు ఆనందుడుతన సంతోషం తెలియచేశాడు.

"మహాశయా! ఇంద్రియనిగ్రహమూ, యోగాభ్యాసమూ మీరు మళ్లీ అనుష్ఠించవలసిన అవసరం వచ్చింది. మాకన్న బలవంతుడైన శత్రురాజొకడు మాపై దండెత్తేడు. మా సైన్యాలు వోడి పారిపోతున్నాయి. మీమీదే ఆశలు పెట్టుకున్నాం. సాధ్యమైనన్ని ఎక్కువ శక్తులు, తక్కువ కాలపరిమితిలో, మీరు కూడబెట్టవలసిన అవసరం ఎంతేనా వుంది. మీ పాత స్నేహితులు బ్రాహ్మల్ని మీకు సహాయం చెయ్యడానికి పిలుద్దామంటే, నాకు మనస్కరించలేదు. అందుచేత వీరిద్దరినీ పిలిపించాను. వీళ్లిద్దరిలోకూడా, సరిగా పొత్తు కుదరలేదు. ఒకడేమో, తల్లకిందులుగా మంటమీద వ్రేలాడగట్టి ముక్కుల్లో కారం పెడితే చాలు అంటున్నాడు. రెండోవాడు కొంచెం క్రూరుడు. మొదటే చర్మం వొలిచివేసి గూలగొండి రాయాలంటున్నాడు. ఈ రెండిటిలో మీకేది అంగీకారమో చెప్పండి." ఆనందుడు, ఆ రెండు పద్ధతులుకూడా అట్టేమంచివి కావని తెలియచేశాడు.

"సరే! దానికేం! ఆ రెండు పద్ధతుల్లో ఏదీ అంగీకారం కానప్పుడు, రెండూకూడా ప్రయోగిద్దాం. మీకు రేపు సూర్యోదయందాకా, ఆలోచించడానికి వ్యవధి యిచ్చాను. యింక మీరు వెళ్లవచ్చు!" అన్నాడు రాజు.

ఆనందుడికి ఒంటినిండా ముచ్చెమటలు పోసి, తలకాయ దిమ్మెక్కిపోయింది భయంతోటి. అయినా ఆ దయ్యం, తనకిచ్చిన వాగ్దానం జ్ఞాపకంవచ్చింది. వెంటనే ఒక నిర్జన ప్రదేశం చేరుకుని, ఆ మంత్రం పఠించాడు. ఇంతలోకే- తనపక్క భయంగొల్పే ఆ దయ్యం కాదు కాని- కావిగుడ్డలూ, జడలూ, విబూది ధరించిన ఒక ముసలిజోగి కన్పించాడు.

"నీ కట్టే కాలవ్యవధి లేదు. త్వరగా నాతో రా! జోగివేషం ధరిద్దువుగాని" అన్నాడు.

సౌమ్య జీవితం, వేషధారణా అలవాటయిన యీ బౌద్ధభిక్షువుకి, బైరాగివేషం అంటే పరమాసహ్యం. అయినా ఏంచెయ్యగలడు? తప్పదు. ఆనందుని తన యింటికి తీసుకుపోయి, అతడి బోడిగుండుకూ, పొడుగాటి గోళ్లులేని వేళ్ళకూ- చింతిస్తూనే, తప్పదుకనక- విభూతి, రుద్రాక్షలు, వేరు కడియాలూ కృత్రిమ జటలూ, మొహాన రంగులూ పూసి, మొత్తంమీద అతణ్ణి పండుగనాటి పెద్దపులిలా తయారుచేశాడు.

చీకటిపడ్డాక, తనతో శ్మశానానికి తీసుకుపోయాడు. అక్కడ ఆనందుని మెడలో, చిన్నపిల్లల పుర్రెలదండ మెడలోవేసి, పెద్దకపాలంఒకటి

ఎడంచేతిలో పెట్టి, కుడిచేతిలోక పెద్ద తొడ ఎముక యిచ్చాడు. అంతక్రితమే ఎవరినో దహనంచేసిన ప్రదేశంలో ఆనందుని కూర్చోబెట్టి, తనతోపాటు మంత్రాలు జపిస్తూ, పుర్రె మీద ఎముకతో వాయించమన్నాడు. ఆపని మొదలెట్టడంతోటే, తుపాను ప్రారంభమయింది. మెరుపులు, వురుములు, పిడుగులు, ఏనుగుతొండపు ధారలతో వర్షం ప్రారంభమయాయి. నక్కలు, తోడేళ్లగుంపులుగా శ్మశానంలో షికార్లు కొడుతున్నాయి. శ్మశానంలోనుంచి అస్థిపంజరాలు లేచి మాంసవిముక్తమైన చేతులు ఆనందునికేసి చాస్తున్నాయి. ఆనందుడు భయంతోటి యింకా గట్టిగా వాయించడం మొదలెట్టేడు. హఠాత్తుగా ప్రారంభమయిన తుపాను హఠాత్తుగానే ఆఖరయింది. ఇంతలో రాజధానినుండి జయధ్వానాలూ, సంగీతం సన్న సన్నగా వినిపించాయి.

"శత్రురాజు చచ్చిపోయాడు. అతని సైన్యం చెల్లాచెదరై పోయింది. ఇదంతా నీ ప్రభే-అనుకుంటున్నారు రాజు. వైద్యా జనం అంతా. మరి నేనెలవు తీసుకుంటూ, మళ్ళీ నీకవసరం అయిందాకా" అని, అఘోరి మాయమైపోయాడు.

ఊరేగింపుసవ్వడి దగ్గర్లోనే వినిపించింది. ఇంతలో దగ్గరకు వస్తూన్న కాగడాల కాంతి మందగోడిగా కనిపిస్తూంది. వాన కురిసి వెలిసిన ఆ తెల్లవారుజామున. తన ఏనుగునుండి దిగి, రాజు ఆనందుని కాళ్లముందర సాష్టాంగపడి, "మహానుభావా! మీరు సిద్ధిగలిగిన జోగులని తెలియకనే నేమైనా అపరాధంచేస్తే క్షమించాలి. మీరీ శ్మశానంలో వున్నంతకాలం నాకిక శత్రువుల భయం లేదు" అని స్తుతించాడు.

వెంటనే రాజాజ్ఞప్రకారం, పాడుపడిన సమీప దేవళంలోంచి నక్కల్ని సిద్ధంగాబయటి కీడ్చేశారు. బాజాలు మోగించి, అది ఆనందునికి ఆవాసంగా బహూకరించారు. రాత్రంతా నిద్రలేని కళ్లతో, నీరసంతో, విభూతి- జడలతో ఆనందుడే దయ్యంలా వున్నాడు. ఇంక కొంత సేపటికి వార్తాహరుడొకడు—రాజుగారికి చాలా జబ్బుగా వుందనీ, వెంటనే తగ్గేటట్లు చెయ్య వలసిందనీ-ఆజ్ఞ తీసికొచ్చాడు. ఆనందుడు కపాలం-ఎముక బయటికి తీసి మంత్రాలు చదువుతూ వాయించ నారంభించాడు. ఆ చప్పుడుకి బెదిరి,

వొకటి, రెండు గబ్బిలాలు బయటికొచ్చేశాయి తప్ప, యే దేవతకాని, దయ్యంకాని ప్రత్యక్షమవలేదు. ఇక లాభంలేదని, ఆ పనిలోంచి విరమించే టప్పటికి నేలలోంచి పుట్టుకొచ్చినట్లు, హఠాత్తుగా ఒక మనిషి ఆనందునిపక్క నిలబడి వున్నాడు. అతడి చేతిలో ఏదో దండంకూడా వుంది. రాజో ద్యోగి కాబోలు.

"సలసల కాగుతున్న నూనె సిద్ధంగావుంది" అన్నాడు.

"ఎందుకూ?" అన్నాడు ఆనందుడు.

"మిమ్మల్ని ముంచేందుకు."

"నన్ను నూనెలో ముంచడం దేనికి?"

"మీ మంత్రతంత్రాలేవీ రాజుగారి బాధను తగ్గించలేకపోయాయి. పోనీ మీకు శక్తి లేదేమో అనుకుందామంటే, యింతవరకటి రెండుపనులూ మీ శక్తిని వేనోళ్ల చాటుతున్నాయి. కనక, యిప్పుడు తగ్గకపోడానికి కారణం, మీ విముఖతే అని రాజుగారు అనుకుంటున్నారు. ఈ వేదన, రాజవైద్యుణ్ణి, నా శక్తినశేషించడం ఎందుకని, రాజుగారి వుద్దేశానికి తాళం వేశాను. ఈ సాయంకాలందాకా, నూనె మరుగుతూనే వుంటుంది. అప్పటికిక్కూడా తగ్గకపోతే, మీరు ఆ నూనెలో ప్రవేశించవలసి వుంటుంది."

"అయ్యో! దైవమా! యిప్పుడేదిదారి నాకు!"

"ఏదారీ లేదు. శ్మశానంచుట్టూ సైనికులు కాపలావున్నారు."

"అయితే నా ప్రాణానికి రక్షణ లేదింక!"

"ఇదిగో! యీ పాత్రలో!" అన్నాడు రాజవైద్యుడు. "దీంట్లో విషం వుంది. నీశత్రులవల్ల, యింతకుముందు సంపాదించానని చెప్పి, రాజుగారికియ్యి. ఆయన చనిపోయాక, అదునుచూసుకుని, నిన్ను బహూకరిస్తాను."

"నాప్రాణం పోయినాసరే కాని, యీ హత్య నేను చెయ్యను. నన్ను ఆపదలోంచి తప్పించడానికింకా నాకు వుపాయం వుంది. 'హూంగ్ పద్మ నూని ఆముహా?'" అని జపించాడు.

కాని ఎవ్వరూ ప్రత్యక్షమవలేదు. రాజవైద్యుడు కూడా, ఆనందునికేసి జాలిగా చూసి, చీకట్లో కలిసిపోయాడు. తన దుస్థితి తలుచుకుంటూ, కన్నీరు కారుస్తూ అట్లాగే ఆనందుడు కలతనిద్రపొందేడు. ఆనిద్దరలో ఒక్లా కల వొచ్చింది.

ఈ లోకాలు దాటి ఆనందుడు, నరలోకపు టంచుల వద్దనుంచుని, చూస్తున్నాడు, వైతరణి మీదుగా. నరలోకం అంతా, ఏదో వుత్సవంలో మునిగినట్లు, హుషారుగా వుంది. నరకంలోని రాక్షసుల్లోని, క్రూరకారంతా, నరకముఖ ద్వారంపగ్గర, విద్యుద్దీపాలు, పూలమాలులు, రంగుకాగితాల అలంకరణలో నిమగ్నులై వున్నారు. పెద్దరాక్షసులు కిందనుంచుని, అవసరమనితోచినపుడుక్రూర రాక్షసుల తోకలను కాగడాలతో అంటిస్తూ చురుకుగా పని చేయిస్తున్నారు. ఆనందుడికి వుండబట్టలేక, వారిలో ఒకణ్ణి యీ సన్నాహం అంతా ఎందుకని అడిగేడు.

"గౌతమబుద్ధుని ప్రియశిష్యులలో ఒకడైన ఆనందునికోసం. ఆయనకోసం ఎదురు చూస్తున్నాం. ఇక అరగంటలోనో, గంటలోనో వస్తాడు!" అన్నాడు.

ఆనందుడికి గుండెలు బరువెక్కాయి. గొంతు తడి ఆరిపోయింది. అయినా, ప్రయత్నంమీద అడిగేడు: ఏ కారణంచేత, ఆనందుడునరకలోకానికి వస్తున్నాడని. "విషంయిచ్చి, హత్యచేసినందుకు" అనిసమాధానం వచ్చింది. ఆనందు డేవో అనుగుదామని నోరు తెరిచీలోగానే, ప్రక్కనేవున్న యిద్దరు రాక్షసపెద్దల సంభాషణ వెవినిపడింది.

"ఆనందుని రౌరవ నరకంలోనే వుంచాలి" అన్నాడొకడు.

"కాదు పెద్దనరకంలోనే" అనాడింకొకడు.

"క్షమించాలి. పెద్దనరకం, రౌరవనరకం అంటేఏమిటో నేను తెలుసుకోవచ్చా?" అన్నాడు, ఆనందుడు మధ్యలో వారి సంభాషణకుఅడ్డువచ్చి.

"తప్పకుండా, దానికేం! పెద్దనరకంలో సలసలకాగే ఇనుములో పడవేసి, కరిగించిన సీసం నోట్లోపోస్తారు. రౌరవనరకంలో కరిగించిన సీసంలో పడవేసి, కరిగిన యినుము నోట్లో పోస్తారు. మా అతిథి ఆనందునికి ఏది తగినదని మేం ఆలోచించుకుంటున్నాం" అన్నారు.

ఆనందుడికి కలత నిద్దురలోంచి మెలకువ వచ్చింది. వొళ్ళంతా వణికిపోతోంది, భయంతోటి. చెమటలు కారిపోతున్నాయి.

"హా! బుద్ధదేవా! ముక్తిబోధకుల దారి ఇంత కంటక సమన్వితమని యిప్పుడు తెలిసింది. నా గర్వానికీ, అహంభావానికీ, గురువచనాతిక్రమణకు ప్రతిఫలం యిప్పు డనుభవిస్తున్నాను— బ్రతికి వుండగానే నరకం. బుద్ధం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!! ధమ్మం శరణం గచ్ఛామి!!!" అని ఆక్రోశించాడు, ఆనందుడు పశ్చాత్తప్త పరిశుద్ధ హృదయంతో.

"నీతప్పుయిప్పటికి తెలుసుకున్నావా? ఆనందా" అని ఒక సుపరిచిత శాంతస్వరం పలకరించింది. ఆనందుడు తిరిగి చూసేసరికి, శాక్యముని గౌతముడు నిల్చుని వున్నాడు. ఆనందుని కంటిమబ్బు తెర తొలగిపోయింది.

"దేవా! నాగతి ఏమిటి? తమ పరిశుద్ధసాన్నిధ్యాన్ని సమీపించుట అసర్హుణ్ణి. పాపిని."

"పాపులు నన్ను సమీపించడానికి జంకనక్కరలేదు. ఆనందా! నీ ధూర్తత, గురువాక్యాతిక్రమణ యివే నిన్ను దూరంగా వుంచుతున్నాయి. ఈరోజునే, నా శిష్యులంతా దేశ దేశాలనుంచి వచ్చి శ్రావస్తి నగరంలో సమావేశమవుతున్నారు. ఆ సమావేశంలో, నీ చర్యలగూర్చి నీవే చెప్పుకుంటావో, లేక నే చెప్పవలసి వుంటుందో అడగడానికే యిక్కడికి వచ్చాను."

"నేనే చెప్తాను. నా దుశ్చరితాన్ని చెప్పుకుని, ఆ అవమానాన్ని నేనే భరిస్తాను" అన్నాడు ఆనందుడు దృఢనిశ్చయంతో.

"సత్యంపలికేవు. ఆనందా! ఇప్పుడు నువ్వా వేషం వదలి, బౌద్ధభిక్షువుకు సరిపోయే వేషం ధరించు. నేను చేసిన నియమాన్ని నేనే యీ వొక్కసారికీ అతిక్రమించి, నిన్ని క్షణాలలో సమావేశస్థలానికి చేరుస్తాను. లేకపోతే, యీ ప్రజలు నిన్ని క్షణమే హంతమారుస్తారు, తమ రాజును విషంయిచ్చి చంపేవనే నెపంతో" అన్నాడు తథాగతుడు.

"అయ్యో! గురుదేవా! నా తప్పిదం మూలాన, మగధలో బౌద్ధమతం నాశనమయిపోతుంది కదా!" అని ఆనందుడు విలపించాడు.

"దేవదేవుడు వచించిన పరమ సత్యమయినా సరే— అసత్యపు వాదనలతో, మాంత్రికాలతో వ్యాప్తి చేసినపుడు నశించక తప్పదు. నీ యీ అనుభవజ్ఞానంతో, పరసీమలలో ప్రజల మాధ్యాన్ని పారద్రోలి, ముక్తిమార్గం బోధన చేయుదువుగాక! నీవుచేసినపని కంత అవమానపడ నవసరంలేదు. ఎందుచేతనంటే, నువ్వు నిజంగా నా మాట నతిక్రమించలేదు; నువ్వు మహాద్భుతాలూ, మానవాతీత ప్రదర్శనలూ చేయలేదుకనక."